సాక్షి ఒడిశా
గురువారం । 21 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.2,81,895
బంగారం	90 మిల్లీ గ్రాములు
వెండి	4 గ్రాముల 900 మిల్లీ గ్రాములు


– భువనేశ్వర్/పూరీ



పకాలి తినాలి..!

ఒడియా ప్రజల సాంప్రదాయాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన పొఖాలో(పకాలి) దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు.

- 8లో



న్యూస్‌రీల్

పేకాట స్థావరాలపై దాడులు



జయపురం: సీజ్ చేసిన బైక్‌లు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి ఝుజారి గ్రామ సమీపంలోని నీలగిరి తోటలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బొరిగుమ్మ పోలీసులు దాడి చేశారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు బొరిగుమ్మ సబ్ డివిజన్ పోలీసు అధికారి తపస్విని కొహార్ నేతృత్వంలో మంగళవారం దాడి చేశారు. అయితే పోలీసులు వస్తున్న విషయం ముందుగానే తెలియడంతో జూదరులు పరారయ్యారు. పేకాట స్థావరం వద్ద పోలీసులు 9 బైక్‌లు, రూ.1,249 నగదు, 5 పేకముక్కల కట్టలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు బొరిగుమ్మ పోలీసుస్టేషన్ అధికారి జుగల్ కిశోర్ షా వెల్లడించారు. జూదం అడ్డాపై దాడి జరిపినవారిలో ఏఎస్‌ఐ చందన ప్రసాద్ మఝి, గోపాల హరిజన్, పీఎస్‌ఐ మానస కుమార్ హేంబ్రమ్, దీప్తి రంజన్ నాయిక్ ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు



నాటుసారాతో నిందితులు

రాయగడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నాటుసారా తయారీ, అక్రమ రవాణా తదితర వాటిపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన శశిఖాల్ పోలీస్‌స్టేషన్ పరిధి చిన్నపెడుములో నిర్వహించిన దాడుల్లో 60 లీటర్ల నాటుసారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అదేవిధంగా పద్మపూర్ పోలీసుస్టేషన్ పరిధి శారదాపూర్, లక్ష్మణ్‌గుడ, డాకుసుగుడ గ్రామాల్లో దాడులు నిర్వహించి 157 లీటర్ల నాటుసారాతో పాటు, మరో 1050 లీటర్ల ఊటను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పాఠశాలల సందర్శన



జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అధికారుల బృందం

జయపురం: జయపురం పట్టణం, జయపురం సమితిల్లో 5టీ పరిధిలో ఆధునిక మెరుగులు దిద్దుకున్న పలు పాఠశాలలను భువనేశ్వర్ నుంచి వచ్చిన ఇద్దరు అధికారుల బృందం బుధవారం సందర్శించారు. ఆ పాఠశాలలు 5టీ ద్వారా ఎలా అభివృద్ధి చెందాయో విశ్లేషించారు. జయపురం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జయపురం సిటీ ఉన్నత పాఠశాల, మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలతో పాటు జయపురం సమితి అంబాగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలలో పనులు, 5టీ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మాణాలు జరిగాయో లేదో పరిశీలించారు. బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి చందన కుమార్ నాయిక్ పనులను వివరించారు.

హోమియోపతి స్పిరిట్ బాటిళ్లు సీజ్




స్వాధీనం చేసుకున్న హోమియోపతి మందులు




అరెస్టైన నిందితులు

బరంపురం: నగరంలో అక్రమంగా విక్రయిస్తున్న హోమియోపతి స్పిరిట్ బాటిళ్లను పోలీసులు సీజ్ చేశారు. ఐఐసీ అధికారి శారద ప్రసాద్ దాస్ తెలిపిన వివరాల మేరకు.. బీఎన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి కొమ్మపల్లిలో రహస్యంగా హోమియోపతి స్పిరిట్ బాటిళ్లు విక్రయిస్తున్న ఇంటిపై పోలీసులు బుధవారం దాడులు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించి రాబట్టిన వివరాల ఆధారంగా, పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధిలోని సిటీ హైస్కూల్ రోడ్‌లో ఉన్న కాంప్లెక్స్‌పై దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.లక్షలు విలువచేసే స్పిరిట్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో హరీష్ సాహు, ప్రదీప్ పాత్రోలు ఉన్నట్లు వెల్లడించారు.

- లోక్‌సభ స్థానంపై బీజేడీ, బీజేపీ కన్ను
- కీలకంగా మారిన అసెంబ్లీ స్థానాలు
- అభ్యర్థుల కోసం వ్యూహాత్మక అడుగులు





పూరీపై గురి..!

భువనేశ్వర్:

రాష్ట్రంలో పూరీ పార్లమెంటరీ నియోజకవర్గం బీజేపీ, బీజేడీకి ప్రతిష్టాత్మకం. ఈ నియోజకవర్గం విషయంలోనే రెండు పార్టీల మధ్య పొత్తు చర్చలు వివాదాస్పదమైనట్లు సమాచారం. శ్రీజగన్నాథ క్షేత్రం ప్రాధాన్యతతో పూరీ లోక్‌సభ స్థానాన్ని చేజిక్కించుకోవాలని అధికార బీజేడీ గత కొన్ని సంవత్సరాల నుంచే వ్యూహాత్మకంగా పలు కార్యక్రమాలు చేపట్టింది. ఇంతలో పొత్తు వ్యవహారం వచ్చింది. అయితే ఈ స్థానం తాము సొంతం చేసుకోవాలని చేసిన వ్యూహ రచన అంచనా మేరకు ఫలప్రదం కాలేదు. దీంతో ఇప్పుడు ఒంటరి పోరులోనైనా పూరీ లోక్‌సభ స్థానం చేజిక్కించుకోవాలని ఉభయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా పరిగణించడంతో త్వరలో జరగనున్న ఎన్నికల్లో పూరీ లోక్ సభ స్థానం ఎన్నిక ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం బీజేడీకి చెందిన పినాకి మిశ్రా పూరీ లోక్‌సభ సభ్యుడిగా ఉన్నారు. 2019లో బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రోపై 12,000 ఓట్ల ఆధిక్యంతో గెలిపొందారు. అయితే పినాకి మిశ్రా ఈసారి పోటీ చేయడానికి ఆసక్తి కనబరచడం లేదు. అదే సమయంలో గత ఎన్నికల్లో ఓటమి పాలైన సంబిత్ పాత్రో పూరీలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబిత్ పాత్రోకు ధీటైన పోటీనిచ్చే అభ్యర్థి కోసం అధికార బిజూ జనతా దళ్ లోతుగా ఆలోచిస్తోంది.

బీజేడీ అభ్యర్థిగా మాజీ ఐపీఎస్..?

ఈ సార్వత్రిక ఎన్నికల్లో మాజీ ఐపీఎస్ అధికారి, చురుకైన నాయకుడు అరుప్ పట్నాయక్‌ని పూరీ లోక్‌సభకు పినాకి మిశ్రా స్థానంలో బరిలోకి దింపేందుకు బీజేడీ వ్యూహ రచన చేస్తోంది. అలాగే నయాగడ్ నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ అరుణ్ కుమార్ సాహు, కందమాల్ లోక్‌సభ సభ్యుడు డాక్టర్ అచ్యుత్ సామంత్ అభ్యర్థిత్వాన్ని సైతం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. 2019 ఎన్నికల తర్వాత ఈ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో, 5 స్థానాల్లో బీజేడీ బలం కొనసాగుతోంది. వీరిలో ఒక ఎమ్మెల్యే ఇటీవల బీజేపీలో చేరడంతో బీజేడీ ఉనికి బీటలు వారింది. 2022లో బిజూ జనతా దళ్ నుంచి బహిష్కరణకు గురైన పూరీ జిల్లా చిలికా సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రశాంత జగదేవ్ ఇటీవల భారతీయ జనతా పార్టీలో చేరారు.

వివాదాస్పదంగా సత్యబాది

ఈ జిల్లాలో సత్యబాది శాసనసభ నియోజకవర్గం వివాదాస్పదం అయింది. ఈ స్థానం కోసం మాజీ ఎమ్మెల్యే సంజయ్ దాస్ బర్మా ఖరారైనట్లు చేసిన ప్రకటన సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపింది. దీంతో బీజేడీ సంక్లిష్ట పరిస్థితిని ఎదురీదాల్సి వచ్చింది. సిటింగ్ ఎమ్మెల్యే ఉమాకాంత సామంతరాయ్‌తో సమావేశాన్ని నిర్వహించి తాత్కాలికంగా సర్దుబాటు చేసింది. సంజయ్ దాస్ బర్మా 2 సార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 2019 ఎన్నికల్లో బ్రహ్మగిరి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి లలితేందు బిద్యాధర్ మహాపాత్రోతో తలపడి సంజయ్ దాస్ బర్మా ఓటమి పాలయ్యారు. దీంతో ఆయన పరపతి కొంతవరకు మసకబారింది. సత్యబాదిలో ఉమాకాంత సామంతరాయ్‌కు బలమైన ప్రజా నాయకుడుగా గుర్తింపు ఉంది. ఈ నియోజకవర్గంలో ఖాతా తెరుచుకోలేని బిజూ జనతా దళ్ 2019లో ఉమాకాంత సామంతరాయ్ పార్టీలో చేరిన తర్వాత విజయం సాధించడం తార్కాణంగా నిలిచిపోయింది. అంతకుముందు 2014 ఎన్నికల్లో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా ఈ నియోజకవర్గం నుంచి పోటీచేసి విజేతగా నిలిచారు. అటువంటి నాయకుడి చేరికతో పూరీ జిల్లాలో బీజేడీ క్రమంగా బలం కూడగట్టుకుంది.

నయాగడ్‌లో గట్టిపోటి

పూరీ జిల్లా నయాగడ్ శాసనసభ నియోజకవర్గంలో కూడా ఈసారి గట్టిపోటీ ఉంటుంది. ఈ నియోజకవర్గం నుంచి వరుసగా 4 సార్లు ఎమ్మెల్యేగా డాక్టర్ అరుణ్ కుమార్ సాహు గెలిచారు. అయితే ఈ నియోజకవర్గం నుంచి భారతీయ జనతా పార్టీ ప్రత్యూష రాజేశ్వరి సింగ్‌ని బరిలోకి దింపేందుకు రంగం సిద్ధం చేసింది. ఈమె కందమాల్ మాజీ ఎంపీ దివంగత హేమేంద్ర చంద్ర సింగ్ భార్య. ప్రత్యూష నయాగడ్ రాణీ మాతగా ప్రాచుర్యం సాధించింది. అలాగే బీజేపీకి చెందిన జయంత్ షడంగి ప్రాతినిథ్యం వహిస్తున్న పూరీ సదర్ సీటుని కైవసం చేసుకోవాలని బీజేడీ ఉరకలేస్తుంది. ఈ అవకాశాన్ని సానుకూలంగా మలచుకుని బీజేడీ టికెటుతో పోటీకి బరిలోకి దిగేందుకు సుభాశిష్ ఖుంటియా ప్రయత్నిస్తున్నారు. ఈ దిశలో ఆశలు నేరవేరే అవకాశం అంతంతమాత్రమే. పూరీ సదరు నియోజకవర్గం నుంచి దివంగత మాజీ మంత్రి, దీర్ఘకాల బీజేడీ ఎమ్మెల్యే మహేశ్వర్ మహంతి కుమారుడు సునీల్ మహంతిని బరిలోకి దింపి మాజీ నాయకునిపై సానుభూతితో తాజా ఎన్నికల్లో ఘన విజయంతో బీజేపీ చేతిలోని పూరీ సదరు స్థానం కైవసం కోసం అధిష్టానం జిత్తులతో సమీక్షిస్తోంది. ఈ నిర్ణయంపై అసంతృప్తి తలెత్తకుండా బీజేడీ అధిష్టానం ముందస్తుంగా సుభాశిష్ ఖుంటియాని రాజ్యసభకు పంపినట్లు తాజా పరిస్థితుల్లో తేటతెల్లమైన విషయం జటిలమైన పరిస్థితిని ప్రేరేపించింది.

కీలకంగా పిప్పిలి

పూరీ జిల్లాలో మరో కీలక నియోజకవర్గం పిప్పిలి. ఈ నియోజకవర్గానికి ప్రదీప్ మహారథి దీర్ఘకాలం బీజేడీ అభ్యర్థిగా ప్రాతినిధ్యం వహించారు. తన మరణం తర్వాత ఆయన కుమారుడు రుద్ర ప్రతాప్ మహారథి ఈ నియోజకవర్గం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఈసారి కూడ పిప్పిలి నియోజకవర్గం తామే దక్కించుకోవాలనే దృక్పథంతో బీజేడీ సన్నాహాలు చేస్తోంది. తండ్రి మరణం సానుభూతితో 2021 సంవత్సరంలో జరిగిన ఉప ఎన్నికలో భారీ ఆధిక్యతతో రుద్ర ప్రతాప్ మహారథి గెలిపొందినా, తాజా రాజకీయ పరిణామాల్లో ఆయన ధీరత్వం ఎంతవరకు సరితూగుతుందనేది బీజేడీ అధిష్టానం బేరీజు వేస్తోంది. గత ఎన్నికల్లో గట్టి పోటీనిచ్చిన బీజేపీ అభ్యర్థి అశ్రిత్ పట్నాయక్‌ని బరిలోకి దింపనున్నట్లు ఆ పార్టీ సమాచారం.

దృష్టి సారిస్తున్న కాంగ్రెస్

పూరీ లోక్‌సభ నియోజకవర్గంపై కాంగ్రెసు పార్టీ సైతం దృష్టి సారించింది. ఈ స్థానంలో విజయం సాధించాల్సిందేననే దృక్పథంతో బలమైన అభ్యర్థి కోసం సమీక్షిస్తోంది. అతి త్వరలో తమ అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్ర కాంగ్రెసు మాజీ అధ్యక్షుడు ప్రసాద్ హరిచందన్ పూరీ లోక్‌సభ నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు బలంగా వ్యాప్తిలో ఉన్నాయి. తదుపరి స్థానంలో జట్నీ నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు సురేష్ కుమార్ రౌత్రాయ్ అధిష్టానం దృష్టిలో ఉన్నట్లు సమాచారం.

‘బీజేపీ విజయానికి కృషి చేయాలి’



సమావేశంలో పాల్గొన్న సుభాష్ కుమార్ సాహు తదితరులు

బరంపురం: గంజాం జిల్లాలో బీజేపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుభాష్ కుమార్ సాహు కోరారు. స్థానిక జెనాన ఆస్పత్రి రోడ్డులోని ఒక ప్రైవేటు హోటల్‌లో జిల్లాస్థాయి నాయకులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులతో పాటు జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన వివిధ రకాల పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. అధికార బీజేడీ నిర్లక్ష్యం కారణంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో రైతులు పండించిన ధాన్యం అమ్మకాలు చేయలేక రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లాలో 22 బ్లాక్‌లు, 17 ఎన్ఏసీలు, మున్సిపల్, కార్పొరేషన్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

కొరాపుట్‌పై కింకర్తవ్యం

- నాయకులతో సీఎం నవీన్ సమావేశం

కొరాపుట్: కొరాపుట్ లోక్‌సభ స్థానంలో బీజేడీ అనుసరించాల్సిన వ్యూహంపై సీనియర్ నాయకులతో రహస్య సమావేశం జరిగింది. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో సీఎం నవీన్ పట్నాయక్ అధ్యక్షతన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశానికి కొరాపుట్ పార్లమెంటరీ స్థానం పరిధిలోని కొరాపుట్, రాయగడ జిల్లాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మెదటి సమావేశం కొరాపుట్ లోక్‌సభ నాయకులతో కావడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. రాష్ట్రంలో మొత్తం 21 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం బీజేడీ-బీజేపీ పార్టీల మధ్య పొత్తు ఉంటుందనే ప్రచారం జోరుగా జరుగుతోంది. పొత్తు ఉంటుందా లేదా అనే దానిపై మాత్రం ఇరుపార్టీల నాయకులు నోరు విప్పడం లేదు.

గత ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం

మొత్తం 21 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ, బీజేడీ పార్టీలకు 20 మంది ఎంపీలు ఉండగా, కేవలం కొరాపుట్ ఎంపీ స్థానం మాత్రమే గతసారి కాంగ్రెస్ గెలిచింది. ఈ నేపథ్యంలో కొరాపుట్ లోక్‌సభ స్థానానికి అధిక ప్రాధాన్యం ఏర్పడింది. సమావేశానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక, పౌర సరఫరాల మంత్రి అతున్ సవ్యసాచి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి, పార్టీ కొరాపుట్ జిల్లా పరిశీలకుడు కెప్టెన్ దివ్యశంకర్ మిశ్ర, జిల్లా అధ్యక్షుడు జిన్ను హిక్కా, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢీ, జయపూర్ మాజీ ఎమ్మెల్యే రబినారాయణ నందోలు హాజరయ్యారు. సమావేశం ముగిసిన తర్వాత లోపల ఏం జరిగిందనే విషయంపై ఎవరూ నోరు విప్పలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ జిల్లా అధ్యక్షుడు జిన్ను సతీమణి కౌసల్య హిక్కా కేవలం 3,613 ఓట్ల తేడాతో ఇక్కడ ఓడిపోవడం గమనార్హం. దీంతో మరోసారి కౌసల్యకి టికెట్ ఇస్తారనే ప్రచారం సాగుతోంది.

భారీగా గంజాయి స్వాధీనం



జయపురం: పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి


జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి మంగిడి గ్రామ సమీప అడవిలో బొయిపరిగుడ పోలీసులు దాడులు జరిపి 198 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ బుధవారం తెలియజేశారు. పోలీసులు దాడి జరుపుతున్న విషయం తెలిసిన గంజాయి మాఫియా వ్యక్తులు పరారయ్యారని వెల్లడించారు. అడవిలో కొంతమంది గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఉంచారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించారని వెల్లడించారు. ఎస్ఐ కృష్ణ చంద్ర సెఠి నేతృత్వంలో పోలీసు టీమ్ దాడి జరిపినట్లు పేర్కొన్నారు.



బరంపురం: అరెస్టైన వ్యక్తిని చూపిస్తున్న పోలీసు

బరంపురం: గంజాం-కందమాల్ జిల్లాల సరిహద్దు తప్పపాణి ఘాట్ రోడ్‌లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వాహనంపై బల్లిగుడా పోలీసు అధికారులు దాడిచేసి, 35 కిలోల గంజాయి బస్తాలు సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేసినట్లు ఐఐసీ అధికారి తపన్ కుమార్ నాయక్ తెలియజేశారు. బరంపురం మీదుగా అక్రమంగా గంజాయి రవాణ చేస్తున్న కారుని బల్లిగుడా పోలీసులు ఆపి తనికీలు చేయగా గంజాయి బయటపడిందని వెల్లడించారు. దీంతో గంగపూర్ గ్రామానికి చెందిన సత్యజిత్ పాణిగ్రహిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

మీకు తెలుసా..?



నబరంగ్‌పూర్ మాజీ ఎంఎల్ఎ దివంగత సదాశివ త్రిపాఠి

కొరాపుట్: ఎక్కడైనా ఒక్కో అసెంబ్లీ స్థానానికి ఒక్క ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించడం సర్వసాధారణం. కానీ గతంలో ఒక అసెంబ్లీ స్థానానికి ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించిన విషయం చాలా మందికి తెలియదు. ఈ విషయం ఒడిశా అసెంబ్లీ రికార్డుల్లో సైతం నమోదై ఉంది. ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో మాత్రమే ఈ నిబంధన ఉండేదని తెలుస్తోంది. బలహీన వర్గాలకు చేయూతనివ్వడానికి ఒక నియోజకవర్గంలో ఒక జనరల్ కేటగిరి ఎమ్మెల్యేతో పాటు ఒక రిజర్వ్ కేటగిరి ఎమ్మెల్యే ఉండేవారు. నబరంగ్‌పూర్ విధాన సభ స్థానం నుంచి 1951లో కాంగ్రెస్ పార్టీ తరుపున జనరల్ కేటగిరి కింద సదాశివ త్రిపాఠి, రిజర్వ్ కేటగిరిలో ముది నాయక్ ప్రాతినిధ్యం వహించారు. 1957లో ఇదే స్థానం నుంచి అదే పార్టీకి చెందిన సదాశివ త్రిపాఠితో పాటు రిజర్వ్ కేటగిరిలో మిరు హరిజన్ కొనసాగారు. తర్వాత ఈ నిబంధనను ప్రభుత్వం ఎత్తివేసింది. జయపూర్, ఉదయగిరి, అనుగుల్, పాల్ లక్రా కే నగర్, డెంకనాల్, భవానీపట్న, జునాగఢ్, సువాపడా, టిట్లాగఢ్, పాట్నాగఢ్, బొలంగీర్, పదంపూర్, సోహేలా, రైరాకోల్, ఝర్సుగుడ, బెమ్రా, సుందర్ గఢ్, కెంజోర్, ఆనంద్‌పూర్, పంచ్‌పిర్, బరిపద, నిలగిరి, చందబలి, సుకింద, జాజ్‌పూర్, బింఝాపూర్, అవొల్, సాలేపూర్, కటక్ రూరల్, నిమాపరా, భువనేశ్వర్, నయాగడ్, కేంద్రపడా, దసపల్లా, అస్కా, బ్రహ్మపుర, పర్లాకిమిడి స్థానాల్లో సైతం ఇద్దరేసి ఎమ్మెల్యేలు ఉండేవారు.

అభ్యర్థులపై కసరత్తు



భువనేశ్వర్: రాష్ట్రంలో బీజేపీతో బీజేడీ పొత్తుపై ఉత్కంఠ తొలగకున్నా, ఉభయ పార్టీలు లోక్‌సభ, విధాన సభలకు పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాపై కసరత్తు చేస్తున్నాయి. కేంద్ర నాయకత్వం ఆమోదం కోసం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఢిల్లీలో తిష్ట వేయగా, రాష్ట్రంలో అధికార పక్షం బిజూ జనతా దళ్ గత 2 రోజులుగా టికెట్టు కేటాయింపు కోసం అభ్యర్థులను ఖరారు చేయడంలో భారీ ఎత్తున కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో జరగనున్న లోక్‌సభ మరియు విధానసభ ఎన్నికలకు టిక్కెట్ ఎంపిక కసరత్తు నవీన్ నివాస్‌లో నిరవధికంగా కొనసాగించింది.

సీఎం నవీన్ నివాస్‌లో సమావేశం

బీజేడీ సీనియర్ నాయకులతో నవీన్ నివాస్‌లో సీఎం నవీన్ పట్నాయక్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎన్నికలకు పార్టీ సన్నద్ధతతో పాటు కొరాపుట్ పార్లమెంటరీ నియోజకవర్గం,7 అసెంబ్లీ సెగ్మెంట్ల అభ్యర్థుల గురించి చర్చించారు. ఈ సమావేశానికి కొరాపుట్‌లోని ముఖ్యమైన బీజేడీ నాయకులతో పాటు మంత్రి జగన్నాథ్ సరకా, సీనియర్ నాయకులు రబి నారాయణ నొందొ, నెక్కంటి భాస్కర్ రావు, ఎమ్మెల్యే ప్రీతమ్ పాఢి, జిల్లా పరిశీలకుడు అతున్ సబ్యసాచి నాయక్ హాజరయ్యారని పార్టీ వర్గాలు తెలిపాయి. గిరిజనుల ప్రాబల్య కొరాపుట్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉలాకా ప్రాతినిధ్యం వహిస్తుండగా, 7 అసెంబ్లీ స్థానాల్లో నాలుగు స్థానాల్లో బీజేడీకి ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ పార్లమెంటరీ నియోజకవర్గం కింద గుణుపురం (ఎస్టీ), బిస్సం కటక్ (ఎస్టీ), లక్ష్మీపూర్ (ఎస్టీ), కొరాపుట్ (ఎస్సీ) బీజేడీ అధీనంలో ఉన్నాయి. జయపురం, పొట్టంగి (ఎస్టీ) విధానసభ స్థానాల్లో కాంగ్రెస్, రాయగడ (ఎస్టీ) స్వతంత్ర అభ్యర్థి శాసన సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

కొరాపుట్ నేతల సమావేశం తర్వాత నవరంగ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం నాయకులతో బీజేడీ అధిష్టానం సమావేశం కానున్నట్లు సమాచారం. తొలుత పూరీ, కేంద్రాపడా లోక్‌సభ నియోజకవర్గాల నాయకులతో అభ్యర్థుల ఖరారు, టికెట్ల కేటాయింపు సన్నాహాలను బీజేడీ అధిష్టానం ప్రారంభించింది. 147 మంది సభ్యుల రాష్ట్ర శాసనసభకు 4 దశల్లో మే 13, మే 20, మే 25, జూన్ 1 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతుంది. 2019లో ఎన్నికైన ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం ఈ ఏడాది జూన్ 2తో ముగుస్తుంది.

క్లుప్తంగా

భువనేశ్వర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో బుధవారం నమోదైన 19.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత మార్చి నెలలో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రతగా ఆల్ టైమ్ రికార్డును బద్దలు కొట్టింది. నగరంలో చివరిసారిగా 1970 మార్చి 6న 24.3 డిగ్రీల సెల్సియస్ పగటి ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో బుధవారం నమోదైన ఉష్ణోగ్రత 1952 నుంచి 2024 వరకు మార్చి నెలలో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత అని భారత వాతావరణ విభాగం ఐఎండీ పేర్కొంది.

పిడుగుపాటుకు మూడు ఎద్దులు మృతి

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి సమితి లక్ష్మీపూర్ గ్రామంలో బుధవారం ఉదయం పిడుగుపాటుకు మూడు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. ఉదయం రైతులు హరిశ్చంద్ర మహంకుడో, రాజేంద్ర మహంకుడో ఆవులను మేత కోసం పొలాలకు తీసుకెళ్లారు. ఈ సమయంలో వర్షం పడడంతో పశువులను చెట్టు కిందికి తీసుకెళ్లారు. ఈ సమయంలో అకస్మాత్తుగా పిడుగుపడి మూడు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. మరో పశువు స్పృహ కోల్పోవడంతో పశు చికిత్సాధికారి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేశారు. ఈ ఘటనపై గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

అప్‌డేట్‌కు సహకరించండి

శ్రీకాకుళం : ఏపీ ఎస్ఎఫ్ఎల్ నెట్‌వర్క్‌లోని అన్ని సెట్‌బాక్సులను సస్పెండ్ చేశామని, కొత్త అప్‌డేట్‌కు సహకరించాలని ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ జిల్లా మార్కెటింగ్ మేనేజర్ గౌతమ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఎల్ఎంఓలు, ఎంఎస్ఓలు వినియోగదారులకు తెలియజేయడంతో పాటు ఇమేజ్ వెర్షన్ అప్‌గ్రేడేషన్ సాంకేతిక సమస్యను పరిష్కరించడంలో సహకరించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించడానికి, సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు 48 గంటల్లో అప్‌గ్రేడేషన్ పూర్తి చేస్తామని తెలిపారు.

ఎన్నికల సామగ్రి కేంద్రం పరిశీలన

సోంపేట: రానున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బుధవారం పరిశీలించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. కేంద్రం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నియోజకవర్గ ఆర్ఓ సుదర్శన్ దొరను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సామగ్రి పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్‌కుమార్, ఇచ్ఛాపురం తహసీల్దార్ భాస్కరరావు, ఎంపీడీఓ రామారావు, పంచాయతీ ఈఓ వరప్రసాద్, ఎస్ఐ హైమావతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలుడి ఊరేగింపు


స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

మెళియాపుట్టి : మండల కేంద్రం మెళియాపుట్టిలో ఈ నెల 24న డోలోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం రాధాగోవింద స్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సత్యనారాయణ రథో మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం రాధాగోవింద స్వామివారిని పల్లకిలో ఉంచి పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. 24న కామదహనం (మఘ) కార్యక్రమాన్ని పర్లాఖిమిడి రాజవంశీయులతో నిర్వహించిన అనంతరం డోలోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జీవరాశులను కాపాడాలి

పాతపట్నం: అంతరించి పోతున్న పిచ్చుకల జాతిని సంరక్షించాలని, జీవరాశులను కాపాడాల్సి బాధ్యత అందరిపై ఉందని ప్రధానోపాధ్యాయుడు ఎస్.వైకుంఠరావు అన్నారు. బుధవారం పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ అడవులు అంతరించిపోవడం, సెల్ టవర్లు, వాతావరణ కాలుష్యం కారణంగా పిచ్చుకుల జాతి రోజురోజుకు కనుమరుగవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్ ఎస్.టి.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకాలి.. తినాలి..!

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా పకాలి దినోత్సవం


బరంపురం: వివిధ రకాల కూరలతో పకాలి

ఒడియా ప్రజల సాంప్రదాయాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన పొఖాలొ(పకాలి) దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పసందైన చేపల వేపుడు, వేర్వేరు కూరలతో పకాలన్నం ఆరగించారు. అందరూ ఒకేచోట కూర్చొని తింటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. వేసవిలో పకాలి తినడం వలన శరీరానికి చల్లదనం లభిస్తుందన్నారు. దీనివలన ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. పకాలి గొప్పదనాన్ని యువత తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్


రాయగడ: సంస్కృతీ సంస్థ వద్ద ఒకేచోట కూర్చొని పకాలి తింటున్న మహిళలు


రాయగడ: పకాలి ఆరగిస్తున్న సంబాద్ సాహితీ కుటుంబం


బరంపురం: పకాలి ఆరగిస్తున్న వృద్ధురాలు


బరంపురం: సిద్ధార్థ హోటల్‌లో పకాలి ఆరగిస్తున్న యువకులు


బరంపురం: దల్మా హోటల్‌లో పకాలన్నం దినోత్సవం జరుపుకుంటున్న స్నేహితులు

తీర ప్రాంతాలకు భారీ వర్ష సూచన


పర్లాకిమిడిలో కురుస్తున్న వర్షం

- కలెక్టర్లకు ఎస్ఆర్‌సీ మార్గదర్శకాలు జారీ

భువనేశ్వర్: రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో మరో 24 గంటల పాటు ఎడతెరిపి లేని వర్షం కురిసే అవకాశం ఉందని స్థానిక భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) బుధవారం తెలిపింది. కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగఢ్, గజపతి జిల్లాల్లో గురువారం ఉదయం వరకు ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగఢ్, గంజాం, గజపతి, కెంజొహార్, మయూర్‌భంజ్, అంగుల్, ఢెంకనాల్, కంధమల్, బౌధ్, భద్రక్, జాజ్‌పూర్, రాయగడ, కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురిసే వాతావరణం నేపథ్యంలో ఎల్లో అలెర్ట్ హెచ్చరిక జారీ చేయబడింది.

రాగల 24 గంటల్లో...

రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేసినందున ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) కార్యాలయం కలెక్టర్లందరికీ మార్గదర్శకాలు జారీ చేసింది. జగత్‌సింగ్‌పూర్, కటక్, గంజాం, ఖుర్దా, నయాగఢ్ మరియు పూరీ జిల్లాల్లో గురువారం ఉదయం 08.30 గంటల వరకు ఒకటి లేదా రెండు చోట్ల మెరుపులతో కూడిన ఉరుములు, భారీ వర్షాలు (7 సెంటీ మీటర్ల నుంచి 11 సెంటీ మీటర్ల వరకు) కురిసే అవకాశం ఉందని ఐఎండీ ఆరెంజ్ వార్నింగ్ జారీ చేసింది. అదేవిధంగా బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, కటక్, గజపతి, గంజాం, పూరీ, ఖుర్దా, నయాగఢ్, కొరాపుట్, మల్కన్‌గిరి, రాయగడ, కంధమల్, ఢెంకనాల్, బౌధ్, అంగుల్, కెంజొహార్, మయూర్‌భంజ్ జిల్లాల్లో గురువారం ఉదయం 08.30 వరకు ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఎటువంటి ప్రకృతి విపత్తునైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు అనుబంధ యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ప్రత్యేక సహాయ కమిషనరు (ఎస్ఆర్‌సి) కార్యాలయం జిల్లాల కలెక్టర్లను విపత్తు సన్నద్ధత మార్గదర్శకాల్ని జారీ చేసింది. ప్రజలు వాతావరణంపై నిఘా ఉంచాలని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో సురక్షిత ఆశ్రయం పొందేలా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. 24 గంటల తర్వాత రాష్ట్రంలో చాలా చోట్ల పగటి పూట ఉష్ణోగ్రతలు 8 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని వాతావరణ సంస్థ అంచనా వేసింది. రాబోయే 4, 5 రోజుల్లో రాత్రిపూట ఉష్ణోగ్రత కూడా 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ పెరగవచ్చని ఈ సంస్థ ముందస్తు అంచనాగా పేర్కొంది.

గజపతిలో జోరుగా వర్షాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గత రెండు రోజులుగా అల్పపీడనం ద్రోణి వల్ల వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల నువ్వుల పంటకు అనుకూల వాతావరణం ఏర్పడిందని రైతులు అంటున్నారు. గజపతి జిల్లా లో వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి.

కాశీనగర్	16.0 మి.మీ
పర్లాకిమిడి	21.0 మి.మీ
రాయఘడ	15.0 మి.మీ
గుమ్మా	12.0 మి.మీ
నువాగడ	6.0 మి.మీ
ఆర్.ఉదయగిరి	22.0 మి.మీ
మోహనా	18.8 మి.మీ
గుసాని	14.0 మి.మీ

వడగాల్పులపై అవగాహన


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సమయంలో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమావేశాన్ని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ బుధవారం ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు క్యూలో ఉన్నటువంటి వారికోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణుల కోసం తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ప్రజారోగ్యశాఖ, మెడికల్ అధికారులను కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ అధికారులను కోరారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.ఆనంద్, అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రో, ఐటీడీఏ అధికారి దిలీప్ కుమార్ బెహరా, ఎమర్జెన్సీ అధికారి జగన్నాథ పాఢి, జిల్లా ప్రకృతి వైపరీత్యాల పర్యవేక్షణ అధికారి ప్రదోష్‌కుమార్ శతపతి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుకలను పరిరక్షించుకుందాం

- డీఎఫ్‌వో రబీంద్ర కుమార్ మిశ్రా

బరంపురం: గత కొన్నేళ్లుగా అంతరించిపోతున్న పిచ్చుకల జాతిని పరిరక్షించుకుందామని గంజాం జిల్లా అటవీ అధికారి రబీంద్ర కుమార్ మిశ్రా పిలుపునిచ్చారు. జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో అంచలిక వికాస్ పరిషత్ సహకారంతో నగర శివారు గుండలా గ్రామంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రబీంద్రకుమార్ మాట్లాడుతూ.. ఇదివరకు మన కళ్లముందు తిరిగే పిచ్చుకలు ప్రస్తుతం అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి పిచ్చుకలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంచలిక వికాష్ పరిసత్ ద్వారా గ్రామాల్లో కృత్రిమ పిచ్చుకల గూళ్లు పెంచే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.


పిచ్చుకల గూళ్లు కడుతున్న వికాస్ పరిషత్ సభ్యులు


ఉచితంగా పిచ్చుక గూళ్లు అందజేస్తున్న దృశ్యం

డోల వేదిక ముస్తాబు



శ్రీమందిరంలో డోలోత్సవం ప్రధాన ఉత్సవాల్లో ఒకటి. ఈ ఉత్సవం కోసం డోల వేదిక ముస్తాబవుతోంది. ఫాల్గుణ పూర్ణిమ పురస్కరించుకుని డోలోత్సవం ప్రత్యేక వేడుక జరుగుతోంది. ఈ సందర్భంగా ఉత్సవ వేదికని అలంకరిస్తున్నారు. – భువనేశ్వర్/పూరీ

విప్లవ పోరాటయోధుడు అప్పలసూరి

- నేడు కోమర్తిలో 27వ వర్ధంతి

నరసన్నపేట:

అణగారిన ప్రజలకు అండగా ఉంటూ దోపిడీ, పీడనలు లేని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి తుదిశ్వాస వరకూ పోరాడిన అమరవీరుల్లో మామిడి అప్పలసూరి ఒకరు. విలువలు, త్యాగాలు, నిబద్ధతకు నిదర్శనంగా నడుచుకుంటూ అటు గిరిజన ప్రాంతంలో ఇటు మైదాన ప్రాంతంలోనూ ప్రజా సమస్యలుపై దృష్టి సారించి వారికి అండగా ఉంటూ వచ్చారు. గ్రామాల్లో పాలర్ల సంఘాలు పెట్టి వారికి న్యాయం జరిగేలా ముందుకు కదిలారు. భూమి లేని ప్రజలకు భూ హక్కులు కల్పించేందుకు అనేక గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో భూ పోరాటాలు నిర్వహించారు. భూ హక్కులు కల్పించారు. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాయతీ కృష్ణమూర్తి, సుబ్బారావు పాణిగ్రహి వంటి అమర వీరులతో కలిసి పనిచేశారు. అజ్ఞాతంలో ఉంటూనే అనారోగ్యానికి గురై సరైన వైద్య సదుపాయాలు అందక 1997 మార్చి 21న అప్పలసూరి మృతి చెందారు. ఆయన స్మృతి చిహ్నంగా కోమర్తిలో నిర్మించిన అమరవీరుల స్మారక స్థూపాన్ని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో నిర్మించారు. అప్పటి నుంచి ఏటా మార్చి 21న సాయుధ గిరిజన రైతాంగ పోరాటంలో అశువులు బాసిన అమర వీరులకు, ఉద్యమాల బాటకు సహకరించి ప్రాణాలు వదిలిన గుమ్మడి లచ్చయ్య, మామిడి లచ్చెమ్మలకూ ఈ సందర్భంగా నివాళులు అర్పించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కోమర్తి అమర వీరుల స్థూపం వద్ద సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ తెలిపారు. ప్రధాన వ్యక్తగా ప్రగతిశీల మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, అరుణోదయా సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కోమర్తిలో అమరవీరుల స్థూపం (ఇన్‌సెట్లో) మామిడి అప్పలసూరి(ఫైల్)

కళ్లను జాగ్రత్తగా కాపాడుకుందాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శరీరంలోని ముఖ్యమైన అవయవాల్లో కళ్లు ప్రధానమైనవని, వీటిని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ నూతన భవనంలో ఐ ఎక్స్ ప్రెస్ సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీవీలు, స్మార్ట్ ఫోన్లు వంటివి అధికంగా ఉపయోగించడం వల్ల కంటిలో శుక్లాలు దెబ్బతింటున్నాయని, చిన్నారులను సాధ్యమైనంత వరకు స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని చెప్పారు. కంటి సమస్యలు వచ్చిన వెంటనే సొంత వైద్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం న్యాయవాదులకు దినేష్ కంటి ఆసుపత్రి నిపుణుడు డాక్టర్ దినేష్ కళ్ల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ ఆపద్ధర్మ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఉపాధ్యక్షుడు గొంటి చంద్ర మౌళి, జ్యోతిర్మయి, సీనియర్ న్యాయవాదులు కద్దాల శ్యాంసుందరరావు, చౌదరి లక్ష్మణరావు, కె.వేణుగోపాల్, పాడి సీతంనాయుడు, బెజ్జిపురపు ఫల్గుణరావు, జల్లు తిరుపతిరావు, పాలిశెట్టి మల్లిబాబు, నిహార్‌నాయుడు, సంస్థ మేనేజర్లు మజ్జి సుమన్, లక్ష్మణరావు, మజ్జి స్వాతి, సాయికుమార్ వెంకటేష్, జయరాం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

సర్పంచ్ అదృశ్యం


వెంకట శ్యామ్ కుమార్

నరసన్నపేట: మండలంలోని కొత్తపోలవలస సర్పంచ్ ఐ.వెంకట శ్యామ్‌కుమార్ (శ్యామ్ బాబు) బుధవారం ఉదయం నుంచి కనిపించడంలేదని భార్య ప్రశాంతి నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వేకువజామున ఇంట్లో లెటర్ పెట్టి ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుచోట్ల వెతికినా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, ఆర్థిక లావాదేవీల కారణంగానే శ్యామ్ కుమార్ వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేశామని, ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

గ్లాకోమాపై అవగాహన అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: కంటిచూపుపై ప్రభావం చూపే ప్రతి ఒక్కరికీ గ్లాకోమా వ్యాధిపై అవగాహన అవసరమని విశాఖకు చెందిన వైద్య విభాగం ప్రొఫెసర్ సి.వీణాబెన్ స్వరూప్ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బుధవారం గ్లాకోమా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్లాకోమా వ్యాధి వల్ల కంటి చూపు తగ్గుతుందని, నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 40 ఏళ్లు దాటిన వారికి ఈ సమస్య ఎక్కువగా వస్తుందని, వ్యాధి బారిన పడితే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్లాకోమా క్యూఆర్ కోడ్ ప్రత్యేక స్టాంప్ పత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ కె.ఆర్.రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత, రెక్టార్ బి.అడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.


గ్లాకోమా క్యూఆర్ కోడ్ ప్రత్యేక స్టాంప్ పత్రాన్ని విడుదల చేస్తున్న ప్రొఫెసర్ వీణాబెన్ స్వరూప్, వీసీ రజిని, అధికారులు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శివ మృతదేహం

గంట్యాడ: బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని వసాది గ్రామం సమీప కొత్త వెలగాడ జంక్షన్‌లో ఈనెల 16వ తేదీ సాయంత్రం జరిగిన రెండు బైక్‌లు ఢీకొనడంతో ఎస్.కోట మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన కార్పెంటర్ ముసినాన శివ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ పరిస్థితి కుదుట పడకపోవడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర నాయుడు తెలిపారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన తారకేశ్వరుడు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని కుసుమ గుడి వీధికి చెందిన బీటెక్ విద్యార్థి కల్లూరి తారకేశ్వరుడు (20) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలో గల సెంచూరియన్ యూనివర్సిటీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న తారకేశ్వరుడు చదువులో రాణించలేకపోతున్నానని మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేనప్పుడు శ్లాబ్‌కు ఉన్న హుక్‌కు ఉరివేసుకున్నాడు. దీనిపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పట్టణ ఎస్సై సంతోషి కుమారి తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

ముద్దాయికి 11 ఏళ్ల జైలు శిక్ష

విజయనగరం క్రైమ్/ రామభద్రపురం: 2017లో జరిగిన కేసు విచారణలో నేర నిర్ధారణ అనంతరం ముద్దాయికి 11 ఏళ్ల జైలు శిక్ష పడింది. బుధవారం వెలువడిన ఈ తీర్పు గురించి ఎస్సై జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలంలోని రొంపల్లికి చెందిన ముదిలి కృష్ణ 2017లో అదే గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. తర్వాత పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలి తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ కేసులో సుమారు 7 ఏళ్లు నిందితుడిపై విజయనగరం సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణలో నిజం నిరూపితం కావడంతో స్పెషల్ జడ్జి ఎస్.పద్మావతి ముద్దాయికి 11 ఏళ్ల శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. అప్పటి బొబ్బిలి సీఐ జి.సంజీవరావు కేసునమోదు చేయగా, మరో సీఐ రామకృష్ణ దర్యాప్తు చేసి నిందితుడిపై కోర్టులో కేసు ఫైల్ చేశారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీంద్రనాథ్ వాదనలు వినిపించగా, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు పర్యవేక్షణలో రామభద్రపురం ఎస్సై జ్ఞానప్రసాద్, కోర్టు హెచ్‌సీ ఎం.గణేష్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారు.

వైభవంగా రామాలయ ప్రతిష్టాపన పూజలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఆల్తిపాలెం గ్రామంలో ఇటీవల పునర్నిర్మించిన రామాలయ ప్రతిష్టాపన పూజలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. మంగళవాయిద్యాలు, వేద పండితుల వేద మంత్రోచ్ఛారణ నడుమ శిఖర ప్రతిష్టాపన, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, తదితరులు ఆలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శన

వేపాడ: మండలంలోని వావిలపాడు పంచాయతీ కడకొండ గ్రామంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శనలో 14 జతల ఎడ్లు పాల్గొనగా కేఎల్‌బీ పటానికి చెందిన బి.మోహన్ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.12వేలు గెలుచుకున్నాయి. అలాగే రెండోస్థానంలో నిలిచిన వావిలపాడుకు చెందిన గండి వెంకటరావు ఎడ్లు రూ.పదివేలు, మూడోస్థానంలో నిలిచిన సింహాద్రిపురానికి చెందిన అభయాంజనేయ స్వామి ఎడ్లు రూ.ఎనిమిది వేలు గెలిచాయి. విజేతలకు నగదు బహుమతులను గ్రామ పెద్దల చేతుల మీదుగా నిర్వాహకులు అందజేశారు.

వచ్చే ఎన్నికల్లో విజయం.. అ'ద్వితీయం'

- వైఎస్సార్‌సీపీకే మళ్లీ అధికార పగ్గాలు
- జగన్‌మోహన్‌రెడ్డిదే మరోసారి ముఖ్యమంత్రి పీఠం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సునాయాసంగా విజయం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయని, మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తారని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆయన విజయనగరంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో గల శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నగరంలోని డివిజన్‌లకు నియమించిన ఎన్నికల పరిశీలకులు, 1,2,3,12,13,14 డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్‌లు, డివిజన్‌ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓటమి భయంతో పొత్తుల కోసం పరిగెత్తడమే ఇందుకు తార్కాణంగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంటే టీడీపీ ఒంటరిగా 175 స్థానాల్లో పోటీ చేసేదని, అటువంటి పరిస్థితి లేకనే చంద్రబాబు ఇతర పార్టీలతో కలిసి పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

సినీ గ్లామర్‌తో సాధ్యమా?

2014 ఎన్నికల్లో రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతానంటూ పోటీ చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ 2024లో జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెడితే చాలన్న పరిస్థితికి దిగజారిపోయారన్నారు. కేవలం సినీ గ్లామర్ చూపించి రాజకీయాల్లో రాణించడం సాధ్యం కాదని, ఆ విషయాన్ని యువఓటర్లకు అవగాహన కల్పించాలని, ప్రతిపక్షాలు విసిరే ప్రలోభాల వలలో పడవద్దని తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ, నాయకులు, కార్యకర్తలకు కోలగట్ల వీరభద్రస్వామి సూచించారు.


హాజరైన వివిధ డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్‌లు, నాయకులు, కార్యకర్తలు

బూతద్దంలో వెతికినా తప్పు పట్టలేరు

40 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎంతో మంది అభిమానులతో పాటు కొంత మంది శత్రువులు తయారయ్యారని కోలగట్ల వీరభద్రస్వామి ఓటమే ధ్యేయంగా అందరూ ఒక దగ్గరకు చేరుతున్నారన్నారు. ఎంత మంది ఒక దగ్గరకు చేరినా ప్రజాబలం ఉన్న వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు కొందరు మైండ్ గేమ్ ఆడుతున్నారని పట్టించుకోవాల్సిన అవసరం లేదని కొట్టిపారేశారు. తన హయాంలో ఏం తప్పులు జరిగాయో పట్టుకునేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, బూతద్దం, బయోస్కోప్ పెట్టి చూసినా ఒక తప్పు కనిపించదన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని ప్రలోభాలకు లొంగవద్దని కోరారు.

పార్టీ శ్రేణుల ఉత్సాహమే విజయానికి నాంది

మీ ఉత్సాహం చూస్తుంటే ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తామన్న భావన స్పష్టంగా కనిపిస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో నాయకుడు, కార్యకర్తలు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లినప్పుడే ఆ పార్టీకి మనుగడ ఉంటుందని, ఆ ఉత్సాహం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ప్రస్ఫుటంగా తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు లంచానికి తావు లేకుండా అర్హులకు అందజేయడం దేశంలో ఎక్కడా జరగలేదని పేర్కొన్నారు.

అశోక్‌గజపతిరాజు రోడ్డెక్కితే ఎన్నికలొచ్చినట్లే

కష్టపడేది మనం..అభివృద్ధిచేసేది మనం..ప్రజా సంక్షేమాన్ని అమలు చేసేది వైఎస్సార్‌సీపీ అయితే..4 ఏళ్ల 10 నెలల కాలం ప్రజలకు కనిపించని కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు లాంటి వాళ్లు ఎన్నికలు రావడంతో రోడ్డెక్కుతారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఎద్దేవా చేశారు. సమావేశంలో అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వైభవ్'ంగా జ్యూయలరీ షాప్ ప్రారంభం


రాజాంలో వైభవ్ జ్యూయలరీ షాపును ప్రారంభిస్తున్న దృశ్యం

రాజాం: పట్టణంలోని పాలకొండ రోడ్డులో గల సీతారామ కాంప్లెక్స్‌లో వైభవ్ జ్యూయలరీ షాపును బుధవారం వైభవంగా ప్రారంభించారు. షాపు ప్రారంభానికి ముందుగా సీతారామ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ సీవీ జగన్నాథస్వామి, వైభవ్ సీఎండీ గ్రంధి భారత మల్లిక రత్నకుమారి, సీఓఓలు గ్రంధి అమరేంద్ర, గొండ్ల రాఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేష్, కంకటాల టెక్స్‌టైల్స్ సీఎండీ కంకటాల మల్లిక్ తదితరులు జ్యోతి ప్రజల్వనచేసి కస్టమర్స్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎండీ గ్రంధి భారత మల్లిక రత్నకుమారి మాట్లాడుతూ కోస్తా ఆంధ్రా, తెలంగాణ, ఉత్తరాంధ్రలో తమ జ్యూయలరీ ఎంతో ప్రాముఖ్యం పొందిందన్నారు. ఉత్తమ నాణ్యత, అనువైన ధరలతో విభిన్న డిజైన్‌లలో బంగారు ఆభరణాల, వజ్రాభరణాలు, ప్లాటినం, రత్నాలు, వెండి ఆభరణాలు, పూజా వస్తువులను ఈ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు అందించేందుకు రాజాంలోని సీతారామ కాంప్లెక్స్‌లో 14 షోరూమ్‌ను ప్రారంభించామని వెల్లడించారు. రాజాం పట్టణ వాసులకు సుపరిచితమైన విశాఖపట్నం వైభవ్ జ్యూయలర్స్ విస్తృతమైన శ్రేణి, అద్భుతమైన పనితనంగల ఆభరణాలను ఇప్పుడు రాజాంలో అందించగలగడం శుభపరిణామమన్నారు. షాపు ప్రారంభోత్సవ కానుకగా బంగారు ఆభరణాలపై తరుగు 9 శాతం నుంచి, ఒక గ్రాము బంగారానికి రూ.150 తగ్గింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రాజాం పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు పాల్గొన్నారు. తొలిరోజు క్విజ్ కాంటెస్ట్ పెట్టి పదిమంది విజేతలకు బహుమతులు అందించారు.

390 కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: గుట్టుగా సాగుతున్న అక్రమ రవాణను అడ్డుకున్న ఎస్.కోట ఎస్ఈబీ అధికారులు 350 కిలోల గంజాయిని బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎవరికీ అనుమానం రాని రీతిలో లారీ క్యాబిన్‌లో గంజాయి తరలించేందుకు అక్రమార్కులు స్కెచ్ గీశారు. ఆ ప్రకారం లారీ క్యాబిన్‌లో డ్రైవర్ సీటు పైనున్న టాప్ బోయినెట్‌లో 150 ప్యాకెట్లలో గంజాయి సర్దిపెట్టారు. 300కిలోల గంజాయిని హద్దులు దాటించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అదే సమయంలో హర్యానాకు చెందిన లారీలో భారీగా గంజాయి రవాణా అవుతోందని లారీ ఎస్‌కోట మీదుగా వెళ్తోందని ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందింది. దీంతో అలెర్ట్ అయిన ఎస్ఈబీ అధికారులు బొడ్డవర జంక్షన్‌లో మాటువేసి ఉదయం 8.45గంటల సమయంలో అరకు నుంచి వస్తున్న లారీని ఆపి సోదా చేశారు. క్యాబిన్‌లో డ్రైవర్ సీటు పైన ఉన్న బోయినెట్‌లో గంజాయి పట్టు బడడంతో లారీని, గంజాయిని స్వాధీనం చేసుకుని, రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ ముస్తక్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డీవీజీ రాజు విలేకరుల సమావేశంలో చెప్పారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.10లక్షల వరకు ఉండవచ్చని, గంజాయి స్మగ్లింగ్ కేసులో లారీ డ్రైవర్ ముస్తఖ్‌ఖాన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు. సోదాల్లో పాల్గొన్న సీఐ సంతోష్, ఎస్సై జి.ఫణీంద్ర తదితర సిబ్బందిని ఆయన అభినందించారు.


పట్టుబడిన గంజాయి, నిందితుడు ముస్తక్‌ఖాన్‌తో ఎస్ఈబీ అధికారులు

విజయనగరంలో తొమ్మిది కిలోలు..

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఓల్డ్ రైల్వేక్వార్టర్స్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని, నిందితుడి దగ్గర తొమ్మిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని బట్వాడ గ్రామం మంగళూరు సౌత్ కనడా డిస్ట్రిక్ట్‌కు చెందిన మహమ్మద్ అజారుద్దీన్ రైల్వేస్టేషన్ వద్దనున్న ఓల్డ్ రైల్వే క్వార్టర్స్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు సమాచారం అందుకున్నారు. దీంతో ఎస్సై నవీన్ పడాల్ సంఘటనా స్థలానికి చేరుకుని అజారుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి దగ్గరనుంచి కిలోన్నర చొప్పున ఆరు గంజాయి ప్యాకెట్లు మొత్తం తొమ్మిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

ప్రజాశాంతి పార్టీతోనే శాంతి


బెరాకాచర్చిలో మహిళలతో మాట్లాడుతున్న కె.ఎ.పాల్

శృంగవరపుకోట: ప్రజా శాంతి పార్టీ పాలనతోనే రాష్ట్రంలో శాంతి, సౌఖ్యం సాధ్యమని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఎ.పాల్ చెప్పారు. ఎస్.కోట పట్టణంలోని బెరాకా చర్చిలో క్రైస్తవ మత ప్రచారకులు, ఫాదర్‌లు, పాస్టర్లతో కలిసి బుధవారం ఎన్నికల ప్రచార సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ.25వేలు, వితంతువులకు రూ.5వేలు చొప్పున పింఛన్లు ఇస్తామన్నారు. విశాఖ ఎంపీ నియోజకవర్గంలో ప్రీకేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్యను అందించేలా యూనివర్సిటీ, ఉచితవైద్యం అందేలా అధునాతనమైన, అతి పెద్ద ఆస్పత్రిని కట్టించే సత్తా తనకు మాత్రమే ఉందన్నారు. ఆంధ్రాలో ప్రజాశాంతి పార్టీ నుంచి 100 మంది ఎమ్మెల్యేలను, విశాఖ నుంచి తనను ఎంపీగా గెలిపించాలన్నారు. ఎస్.కోట నుంచి ఎమ్మెల్యేగా తనను పోటీ చేయాలని పలువురు కోరుతున్నారని, ఈ విషయమై ఆలోచిస్తున్నానని చెప్పారు.

లెండిలో ముగిసిన స్టూడెంట్ వర్క్‌షాప్

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రోగ్రామ్‌బుల్ లాజిక్ కంట్రోలర్‌పై రెండు రోజులుగా జరుగుతున్న నేషనల్ లెవెల్ వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఎంకోర్ టెక్నాలజీస్ సహాయంతో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో ఇండస్ట్రీలో పీఎల్‌సీ ప్రాముఖ్యాన్ని వివరించారు. ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు, అధ్యాపకులు, ఎంకోర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ సాయిశ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, విభాగాధిపతులు కె.సుబ్బరామయ్య, బీవీఎస్ ఆచార్యులు, పి.జా నకి తదితరులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 57మంది ఎంపిక

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడిలోని అవంతి సెయింట్ థెరిశా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 57 మంది బీటెక్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన దాట్సోల్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఆ సంస్థ ప్రతినిధి ప్రసాద్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలో విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.జాషువాజయప్రసాద్ మాట్లాడుతూ క్యాంపస్ ఇంటర్వ్యూకు అవంతి కళాశాలకు చెందిన 177 మంది విద్యార్థులు హాజరు కాగా 57 మంది ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులకు ఆప్టిట్యూడ్ టెస్ట్, జూమ్, మౌలిక పరీక్ష నిర్వహించి అర్హత సాధించిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. కార్యక్రమాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

● అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఇరు రాష్ట్రాల ఎస్పీలు


అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద భద్రతపై చర్చిస్తున్న ఎస్పీలు జీఆర్ రాధిక, శ్వేతకుమారి

రాబోయే ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా కొనసాగించాలని శ్రీకాకుళం ఎస్పీ జీఆర్ రాధిక, గజపతి జిల్లా (ఒడిశా) ఎస్పీ శ్వేత కుమారి అన్నారు. పాతపట్నం సరిహద్దులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టుల వద్ద ఇరు రాష్ట్రాల పోలీసులు సహకరించుకోవాలన్నారు. మద్యం, డబ్బు, ఇతర నిషేధిత వస్తువులు అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాతపట్నం, గజపతి పోలీసులు సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ బాలచంద్ర రెడ్డి, గజపతి జిల్లా (ఒడిశా) డీఎస్పీ మాధవనందన్ నాయక్, పాతపట్నం సీఐ నల్లి సాయి, పర్లాకిమిడి సీఐ(ఐఐసీ) ప్రసాంత్ కుమార్ భూపతి, ఎస్ఐ మహమ్మద్ యాసీన్ పాల్గొన్నారు.

–పాతపట్నం

కనకమహాలక్ష్మి జాతర ఆదాయం రూ.22,39,349

- లెక్కించిన దేవస్థానం కమిటీ
- హుండీల ద్వారా రూ.12,85,101
- టిక్కెట్ల రూపంలో రూ.9,54,248
- గత ఏడాది కంటే రూ.1,42,473 పెరుగుదల


అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

చీపురుపల్లి: భక్తుల కొంగుబంగారం, చీపురుపల్లిలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవాల సందర్భంగా జరిగిన మూడురోజుల ఉత్సవంలో రూ.22,39,349 ఆదాయం లభించింది. ఈ నెల 17, 18,19 తేదీల్లో మూడు రోజుల పాటు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర వేడుకగా జరిగింది. ఈ మూడు రోజుల జాతరకు లభించిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. అమ్మవారి దేవస్థానంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ, దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్‌చైర్మన్ సూరు కుమార్‌ల నేతృత్వంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా జాతరలో అమ్మవారికి భక్తులు హుండీల్లో సమర్పించుకున్న దక్షిణల ద్వారా రూ.12,85,101 లభించింది. అలాగే అమ్మవారిని దర్శించుకునేందుకు దేవదాయశాఖ ఏర్పాటు చేసిన రూ.10, రూ.20, రూ.50, రూ.100 టిక్కెట్ల రూపంలో రూ.9,54,248 ఆదాయం వచ్చింది. దీంతో గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1,42,473 ఆదాయం పెరిగింది. అయితే జాతర మూడు రోజుల్లో చివరి రోజు మంగళవారం అత్యధికంగా భక్తుల రద్దీ ఉంటుంది. అయితే చివరిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో భక్తుల రద్దీకి ఆటంకం కలిగింది. దీంతో కాస్త ఆదాయం తగ్గినట్లు దేవదాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ.లక్ష్మి, ఈఓ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాలు తగ్గుముఖం

- 10 చోట్ల ఫ్లై ఓవర్‌ల నిర్మాణంతో యాక్సిడెంట్లకు చెక్
- ధైర్యంగా ప్రయాణిస్తున్న వాహనచోదకులు


పూసపాటిరేగలో ఫ్లై ఓవర్

పూసపాటిరేగ: విజయనగరం జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాలను కలుపుతూ వెళ్తున్న జాతీయరహదారిలో ఫ్లై ఓవర్‌ల నిర్మాణం పూర్తి కావడంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. గ్రామాలు ఉన్న చోట జాతీయరహదారిపై ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు విడిచి, కొంతమంది క్షతగాత్రులుగా మిగిలేవారు. ఫ్లై ఓవర్‌ల నిర్మాణం పూర్తయిన తరువాత వాహనాలు వంతెన పైనుంచి వెళ్లడంతో ట్రాఫిక్ తగ్గి ప్రమాదాలకు అడ్డుకట్ట పడింది. కోనాడ, సీహెచ్ అగ్రహారం, మైలాన్, కనిమెట్ట జంక్షన్‌లు, కందివలస గెడ్డ వద్ద ఫ్లై ఓవర్‌ల నిర్మాణం పూర్తి కావడంతో ప్రస్తుతం ట్రాఫిక్ ఇబ్బందులు లేవు. అలాగే భోగాపురం మండలంలో సుందరపేట, భోగాపురం, అక్కివరం, రావాడ, పోలిపల్లి జంక్షన్‌లలో ఫ్లై ఓవర్‌లు ఉండడంతో ఆయా గ్రామాల పరిధిలో కూడా ప్రమాదాలు తగ్గాయి. ఎంతో కాలంగా ఇబ్బంది పడుతున్న వాహనచోదకుల సమస్య తీరడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణంతో తగ్గిన ప్రమాదాలు

హైవేపై ఫ్లై ఓవర్‌ల నిర్మాణం జరగడంతో ప్రమాదాలు తగుముఖం పట్టాయి. జాతీయరహదారిపై జంక్షన్‌లలో గ్రామాలు ఉన్న చోట్ల ఫ్లై ఓవర్‌ల నిర్మాణం పూర్తి కావడంతో వాహనాలపై ప్రయాణం చేసేందుకు ధైర్యంగా ఉంది.

– కప్పల కృష్ణ, వాహనచోదకుడు, పూసపాటిరేగ

మానవ మనుగడకు పరిశోధనలు కీలకం

- శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ వి.శొంటి


శాస్త్రవేత్త డాక్టర్ రమేష్‌ను సత్కరిస్తున్న సెంచూరియన్ వీసీ పీకే మహంతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మానవ మనుగడకు పరిశోధనలు అత్యంత కీలకమని ఐసీజీఈబీ డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ వి శొంటి అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో స్మార్ట్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో మిపామ్–2024 సదస్సు ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఆయన మాట్లాడుతూ ఆహార ధాన్యాల దిగుబడులు అధికంగా ఉండాలంటే పంటకు చీడ, పీడల బెడద ఉండరాదన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెంది వృక్ష శాస్త్రవేత్తలు, పరిశోధకులు కలిసి పరస్పర శాస్త్రీయ చర్చలు జరపడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వర్సిటీ ప్రతినిధులు శాస్త్రవేత్త రమేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చురీకని తీసుకెళ్లి.. ప్రాణం పోశారు!

- రైలు పట్టాలపై అచేతనంగా వృద్ధుడు
- మృతి చెందాడనుకుని ఆస్పత్రి మార్చురీ గదికి తరలింపు
- బతికే ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించిన వైద్యులు


పరదాలో పూర్ణను మూటకట్టిన దృశ్యం


మృతదేహమని భావించి తరలిస్తున్న జీఆర్‌పీ, ప్రైవేటు సిబ్బంది

కాశీబుగ్గ : ఒకటా..రెండా.. పదుల సంఖ్యలో రైళ్లు ఆ వృద్ధుడి మీదుగానే రాకపోకలు సాగించాయి. అలాంటి పరిస్థితుల్లో మృత్యువును జయించిన మృత్యుంజయుడిగా నిలిచాడో వృద్ధుడు. వివరాల్లోకి వెళ్తే.. పలాస రైల్వేస్టేషన్‌లో రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఉందని పలాస జీఆర్‌పీ పోలీసులకు బుధవారం వేకువజామున సమాచారం అందింది. ఎవరు.. ఎలా మరణించారనే కారణాలు తెలియకపోయినప్పటికీ శాఖాపరంగా ఫొటోలు తీయడం, వివరాలు ఆరా తీయడం తదితర అంశాల రీత్యా పట్టాల మధ్యనే మృతదేహాన్ని ఉండనిచ్చారు. అనేక రైళ్లు ఆయన పైనుంచే రాకపోకలు జరిగాయి. ఆ తర్వాత వృద్ధుడ్ని తాళ్లతో మూట కట్టేశారు. రైలు పట్టాలపై మృతదేహం ఉందని, వచ్చి పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలోని మార్చురీకి తరలించాలని ఉదయం 9.30 గంటల సమయంలో పలాస 108 అంబులెన్సుకు రైల్వేస్టేషన్ నుంచి ఫోన్‌కాల్ వెళ్లింది. వెంటనే సిబ్బంది వచ్చి వృద్ధుడ్ని స్ట్రెచ్చర్‌పై 108 వాహనం ద్వారా ఆస్పత్రికి తీసుకొచ్చారు. నిబంధనల ప్రకారం తొలుత మృతదేహం అని నిర్ధారించడానికి చిన్నపాటి పరీక్షలు చేపడతారు. దీనిలో భాగంగా ఆస్పత్రి అత్యవసర విభాగంలో బుధవారం ఉదయం షిఫ్ట్‌లో ఉన్న డ్యూటీ డాక్టర్ ఉంగ కిరణ్‌కుమార్, సిబ్బంది నిశితంగా పరిశీలించారు. పల్స్ చిన్నగా కొట్టుకోవడం, కొన ఊపిరి ఉన్నట్లు గుర్తించి హుటాహుటిన కృత్రిమ ఆక్సిజన్ అందించి అవసరమైన ఇంజక్షన్, సెలైన్ బాటిల్ ఎక్కించారు. డాక్టర్ శరత్, డాక్టర్ సురేష్, స్టాఫ్‌నర్సు శ్రీదేవి, అశ్వినిలతో పాటు ఇతర సిబ్బంది అరగంట పాటు శ్రమించగా ఊపిరి తిరిగొచ్చింది. స్పృహలోకి వచ్చిన అనంతరం వివరాలు ఆరా తీయగా.. తన పేరు డొక్కారి పూర్ణ(58) అని, ఒడిశా రాష్ట్రం కటక్ సమీపంలోని డొక్కారి గ్రామానికి చెందినవాడినని చెప్పాడు. పూర్తిగా తేరుకున్నాక ఘటన వివరాలు రాబడతామని వైద్యులు తెలిపారు.


స్పృహలోకి వచ్చిన డొక్కారి పూర్ణ